సాక్షి చిత్తూరు

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్సీలు ఎంవీ.రామ చంద్రారెడ్డి, కల్పలత తెలిపారు. - 8లో



ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ధ్యానంతో ఒత్తిడి తొలగి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	23
తిరుపతి	34	25
తిరుమల	30	21
గూడూరు	37	27
నగరి	35	25

న్యూస్‌రీల్

ఇంటింటా ఆనందం నిండాలి



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి



నారాయణస్వామి డిప్యూటీ సీఎం



మంత్రి ఆర్‌కే రోజా



ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు/తిరుపతి అర్బన్: జిల్లా ప్రజలకు ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ వేర్వేరు ప్రకటనల్లో వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలిగించే గణనాథుని దీవెనలతో ఇంటింటా ఆనందాలు నిండాలని ఆకాంక్షించారు. సుహృద్భావ వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

దసరా మహోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో అక్టోబరు 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాల పోస్టర్లును ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా మహోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 15న బాలత్రిపుర సుందరీదేవి, 16న పార్వతీదేవి, 17న మహాలక్ష్మీదేవి, 18న ధనలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని పేర్కొన్నారు. అలాగే 19న శ్రీ శాకాంబరీదేవి, 20న శ్రీసరస్వతీదేవి, 21న శ్రీ దుర్గాదేవి, 22న శ్రీమహిషాసుర మర్ధినిదేవి, 23న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహిస్తారని తెలిపారు. భక్తుల రద్దీకి తగిన విధంగా అవసరమైన ఏర్పాట్లు, సదుపాయాల కల్పనపై ఆలయ అధికారులతో పెద్దిరెడ్డి సమీక్షించారు.

నేటి స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రకటించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వినాయకచవితి ప్రభుత్వ సెలవు దినం కావడంతో సోమవారం స్పందనను రద్దు చేసినట్లు, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు.

పోలీసు స్పందన రద్దు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో సోమవారం నిర్వహించాల్సిన పోలీసు స్పందనను వినాయక చవితి నేపథ్యంలో రద్దు చేసినట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా వరాహస్వామి జయంతి

తిరుమల : తిరుమలలోని శ్రీ భూ వరాహస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం వరాహ జయంతి ఘనంగా నిర్వహించారు. ఉదయం కలశస్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేశారు. విశేష అభిషేకాలు జరిపించారు. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

పంట పొలాలపై గజరాజుల విధ్వంసం



ధ్వంసమైన టమాట పంట

చౌడేపల్లె: చారాల కాలనీ సమీపంలోని పంట పొలాలపై ఆదివారం తెల్లవారుజామున ఏనుగులు విరుచుకుపడ్డాయి. రైతులు జి.కృష్ణప్ప, మునిరత్నం, శంకరకు చెందిన టమాటా, వరి, మామిడి పంటలను తొక్కి నాశనం చేశాయి. సుమారు 5 ఎకరాల్లోని పంటకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఏనుగులు స్వైర్య విహారం చేస్తుండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు.



విద్యుద్దీపాల వెలుగులో శ్రీనివాస సేతు (ఇన్‌సెట్) సీఎం వైఎస్ జగన్

నేడు తిరుపతికి సీఎం రాక

- పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

తిరుపతి అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా తిరుపతిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లిని దర్శించుకోనున్నారు. అనంతరం శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు చేరుకోనున్నారు. ఈ మేరకు అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు. పర్యటన వివరాలు ఇలా..

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు.
- 3.25కి ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 3.50 గంటలకు తిరుచానూరు మార్కెట్ యార్డ్ సమీపంలోని సభా ప్రాంగణానికి విచ్చేస్తారు.
- శ్రీనివాస సేతు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నూతన హాస్టల్ భవనాల ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు.
- టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయింపు పత్రాలను పంపిణీ చేసి 4.20 గంటలకు బయలుదేరుతారు.
- 4.30 గంటలకు గంగమ్మను దర్శించుకుంటారు.
- 4.55కు బయలుదేరి, 5.40 గంటలకు తిరుమలకు చేరుకుని వకుళమాత అతిథిగృహం, అనంతరం 5.55కి రచన గెస్ట్‌హౌస్ ప్రారంభిస్తారు.
- 6.10గంటలకు శ్రీ పద్మావతి అతిథి గృహానికి చేరుకుని 7.40 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు.
- అనంతరం రాత్రి 7.45 బేడీ ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుంటారు.
- 7.55 నుంచి 9.10 వరకు శ్రీవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. టీటీడీ క్యాలెండర్-2024 ఆవిష్కరిస్తారు. పెద్ద శేష వాహనసేవలో పాల్గొంటారు.
- 9.15 గంటలకు శ్రీపద్మావతి అతిథి గృహానికి చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు.
- మంగళవారం ఉదయం 6.10 గంటలకు శ్రీపద్మావతి అతిథి గృహం నుంచి బయలుదేరి 6.20 గంటలకు శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు. స్వామివారి దర్శనానంతరం 6.50 గంటలకు పద్మావతి అతిథి గృహానికి బయలుదేరుతారు. అల్పాహారం తీసుకుని, 7.35 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు తిరుగుప్రయాణమవుతారు.
- 9గంటలకు రేణిగుంట నుంచి విమానంలో కర్నూల్ జిల్లా ఓర్వకల్లుకు బయలుదేరుతారు.

నగరానికి మణిహారం

తిరుపతి తుడా : తిరుపతికి మణిహారం శ్రీనివాస సేతును ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించనున్నట్లు స్మార్ట్‌సిటీ ఎండీ హరిత తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆదివారం ఈమేరకు సీఎం పర్యటించనున్న ప్రాంతాలను తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరితతో కలిసి ఆయన సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కట్టుదిట్టంగా భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కృష్ణారెడ్డి, డీపీఆర్‌ఓ బాల కొండయ్య, గంగమ్మ గుడి చైర్మన్ గోపీయాదవ్, ఈఓ ముని కృష్ణయ్య, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.



సభా వేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

కాణిపాకం..
ఆధ్యాత్మిక వైభవం



విద్యుద్దీపకాంతులీనుతున్న ఆలయం

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. సోమవారం చవితి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం విస్తృత చర్యలు తీసుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలు, లడ్డూ ప్రసాదాలు, అన్న ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. ఆలయం, పరిసరాలు విద్యుద్దీప కాంతులతో మిరుమిట్లుగొలుపుతున్నాయి. మంగళవారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సుగంధ పరిమళాలు వెదజల్లే విదేశీ పుష్పాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు. కాంచిన కనులదే భాగ్యం అన్నట్లు కాణిపాకం ఆధ్యాత్మిక వైభవం సంతరించుకుంది.

- నేడు చవితి వేడుకలకు సర్వం సిద్ధం
- చందన అలంకరణలో స్వామివారు దర్శనం
- విద్యుద్దీప కాంతులతో విరాజిల్లుతున్న ఆలయం
- ఆకర్షిస్తున్న బ్రహ్మోత్సవ కటౌట్‌లు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయంలో చవితి వేడుకలకు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి చందన అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిత్య అన్నదాన ప్రసాదం అందించనున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలు నిర్వహించే 21 రోజుల పాటు ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు తెలిపారు. రోజూ వేకువజామున 4 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కూలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలను తిలకించేందుకు వచ్చే భక్తులకు కూడా వసతులు కల్పించామన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి పట్టువస్త్రాల సమర్పణ

వినాయక చవితి సందర్భంగా స్వామివారికి సోమవారం ఉదయం 9 గంటలకు పట్టువస్త్రాలను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సమర్పించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పట్టువస్త్రాలు సమర్పించనున్నారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరుకానున్నారని తెలిపారు.

హద్దులు దాటిన ఆనందం

తమను రెగ్యులర్ చేసి కుటుంబాల్లో ఆనందాలు నింపారని ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కుప్పంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల మహా ర్యాలీతో హద్దుల్లేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధర్యంలో 132 ఉద్యోగ, వివిధ ఉపాధ్యాయ సంఘాలు నాయకులు, సభ్యులు 4 వేల మందికి పైగా ర్యాలీలో పాల్గొనడం పండుగ వాతావరణం సంతరించుకుంది. ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామరెడ్డి, తూర్పు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ముఖ్య అతిథులు పాల్గొన్నారు.

- రెగ్యులర్ చేసినందుకు కాంట్రాక్ట్ ఉద్యోగుల సంబరాలు
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం
- థ్యాంక్యూ సీఎం నినాదాలతో మార్మోగిన కుప్పం
- నలుమూల నుంచి తరలివచ్చిన
- ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు



హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు



ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మందిని రెగ్యులర్ చేయడంపై కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. వినాయక చవితి ముందే వచ్చిందా అన్న విధంగా కాంట్రాక్ట్ కార్మికులు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉదయం 11 గంటలకు పట్టణంలోని శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ర్యాలీ ప్రారంభించారు. అక్కడి నుంచి నుంచి బీసీఎస్ కల్యాణ మండపం వరకు మహా ర్యాలీ కొనసాగింది. బస్టాండు ప్రాంగణంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించి , రోడ్డు పొడవునా బాణసంచా పేల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో వైఎస్సార్ విగ్రహం వద్ద భారతమాత విగ్రహానికి పూలమాల వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం బీసీఎన్ కల్యాణ మండపంలో బహిరంగ సభలో సైతం జై జగన్, థ్యాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేస్తూ హద్దులులేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న తమ జీవితాల్లో సుఖ సంతోషాలు నింపిన మహానుభావుడు సీఎం జగన్ మోహన్ రెడ్డి అని కృతజ్ఞతలు తెలియజేశారు.

థ్యాంక్యూ సీఎం సర్ ప్లకార్డులు

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి చూపుతున్న చొరవను తెలియజేస్తూ 'థ్యాంక్యూ సీఎం' ప్లకార్డులు ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా శాఖల సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణ పురవీధులు ఉద్యోగ, ఉపాధ్యాయుల ర్యాలీలో కిక్కిరిసింది. సుమారు రెండు కిలో మీటర్ల మేరకు ఉద్యోగుల ర్యాలీ జరగడం కుప్పం చరిత్రలో ప్రథమంగా స్థానికులు చర్చించుకుంటున్నారు.

మళ్లీ జగనన్నే సీఎం

రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మెహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యం. రాష్ట్ర నలుమూ ల నుంచి కుప్పం వచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలపడమే ఇందుకు నిదర్శనం. ఉద్యోగుల సమస్యలను సీఎం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులు వ్యతిరేకంగా ఉన్నారని అసత్యాలు సృష్టిస్తున్నా వారికి కుప్పంలో ఉద్యోగ , ఉపాధ్యాయ సంఘాల ర్యాలీతో కనువిప్పు కలిగాలి. ఇప్పటికైనా కుహనా నేతలుతెలుసుకోవాలి. -ఎమ్మెల్సీ భరత్

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

ఉద్యోగాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీఠ వేస్తున్నారు. 25 ఏళ్లుగా పోరాటం చేస్తున్న డీఎస్సీలో అర్హత పొందిన వారికి ఉద్యోగ అవకాశం కల్పించారు. ఏ ప్రభుత్వాలు చేయలేని ప్రయోజనాలు కల్పిస్తున్నారు. 11 వేల పీఈటీలకు పదోన్నతి, ఉద్యోగులకు పదవి విరమణ వయస్సు 62 వరకు పెంపు, 54 వేల మంది ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తింపు ఇచ్చారు.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, తూర్పు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

పర్యవేక్షిస్తూ.. అంకురాలకు బీజం వేస్తూ!



తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. స్వామి వారి సర్వసేనాధిపతి విష్వక్సేనుడు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ మాడ వీధుల్లో కలితిరిగారు. వైఖానస ఆగమశాస్త్ర బద్ధంగా ఈ వేడుక నిర్వహించారు. యాగశాలలో లలాట, బహు, స్తన పునీత ప్రదేశంలో భూమి పూజ (మత్సంగ్రహణం) నిర్వహించారు. తొమ్మిది పాళికల్లో (కుండలు) తొమ్మిది రకాల నవధాన్యాలతో అంకురార్పణం(బీజావాపం) చేశారు. అంకురాలను ఆరోపించే కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణం అంటారు. ఉత్సవాలు విజయవంతం కావాలనే సత్సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించడం సంప్రదాయం. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగి.. సిరిసంపదలు కలగాలి



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): విఘ్నాలు తొలగాలి..ప్రతి కుటుంబం సిరిసంపదలతో తులనాడాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆకాంక్షించారు. వినాయక చవితిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ పెనుమూరు మండల అధ్యక్షుడు కామసాని విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 గ్రామాలకు సుమారు రూ.2 లక్షల వ్యయంతో వినాయక విగ్రహాలను తయారు చేయించారు. వీటిని ఆదివారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో అవరోధాలను అధిగమించి ప్రజలకు మేలు చేయాలనే తపన ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అన్ని కుటుంబాల్లో సంతోషాలు వెదజల్లుతున్నాయని చెప్పారు. అధికార దాహంతో పేద ప్రజలను మరింత కఠిక పేదరికానికి తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్న దుష్టశక్తులను, పెత్తందార్ల కోసం పనిచేసే రాజకీయ పార్టీలను, ప్యాకేజీల కోసం పాకులాడే నేతల దుష్ట పన్నాగాలను వినాయకుడు అడ్డుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ రాక్షసుల నుంచి పేదలకు విముక్తి కలిగి జగనన్న ద్వారా మరింత సంక్షేమ పథకాలు అందించేలా అనుగ్రహించాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. ఏటా మండలంలో వినాయక విగ్రహాలను ఉచితంగా అందిస్తున్న విజయకుమార్ రెడ్డిని మంత్రి అభినందించారు. ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అవినీతిని కనిపెట్టింది చంద్రబాబే

శ్రీరంగరాజపురం/ చిత్తూరు రూరల్: ప్రపంచంలోని అన్ని వింతలను, గ్రహాలను, వస్తువులను కనిపెట్టింది తానేనని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు .. అవినీతిని కూడా కనిపెట్టింది తానే అని ఎందుకు చెప్పడం లేదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రశ్నించారు. శ్రీరంగరాజపురం మండలంలోని గంగమ్మ గుడి వద్ద, చిత్తూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండెకరాల భూమి ఉన్న చంద్రబాబుకు రెండు లక్షల కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. ప్యాకేజ్ కోసం అభిమానులను, కులాన్ని తాకట్టు పెట్టడం న్యాయమేనా అని పవన్‌ను ప్రశ్నించారు. చంద్రబాబు ఆర్థిక నేరస్తుడిగా జైలుకెళ్లారు. నేరస్తునితో చేతులు కలిపినా పవన్‌కూడా నేరస్తుడే అని ఆరోపించారు.

విశ్వకర్మ యోజనతో కార్మికుల అభ్యున్నతి



విశ్వకర్మ చిత్రపటానికి హారతి ఇస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో విశ్వకర్మజయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచానికి అసలైన సృష్టికర్తగా పిలుస్తున్న విశ్వకర్మ హస్తకళాకారులు, వాస్తు శిల్పులందరికీ అధిపతి అని అన్నారు. దేవతల రాజభవనాలను అధికారికంగా నిర్మించారనే ప్రతీతి ఉందని గుర్తు చేశారు. నేటికీ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చరల్‌లతో పాటు చేతివృత్తులు, హస్తకళాకారులు, మెకానిక్స్, స్మిత్‌లు, వెల్డర్‌లు, పారిశ్రామిక కార్మికులు, ఫ్యాక్టరీ కార్మికులు విశ్వకర్మను కొలుస్తారన్నారు. విశ్వకర్మ జయంతిని అధికారికంగా జరుపుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం శుభపరిణామన్నారు. విశ్వకర్మల వల్లే చేతివృత్తులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. చేతివృత్తుల, సంప్రదాయ హస్తకళా నైపుణ్యాల పెంపునకు, వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకం తీసుకొచ్చిందన్నారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖాధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏవో కులశేఖర్, బీసీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి
- శివానంద పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభం

చిత్తూరు రూరల్: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని పీవీకేఎన్ కళాశాల సమీపంలో ఆదివారం శివానంద పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. యోగా భవన్ పైఅంతస్తులో సుమారు రూ.38లక్షలతో ధ్యాన కేంద్రాన్ని నిర్మించారు. ఈ నిర్మాణ పనులకు విజయానందరెడ్డి రూ.20లక్షలు విరాళంగా అందజేశారు. ప్రారంభోత్సవ అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనుగుణంగా మనిషిలో మార్పులు రావాలన్నారు. ముఖ్యంగా పనిఒత్తిడి, కుటుంబ సమస్యలను దూరం చేసుకోవాలని తెలిపారు. ఇలాంటి ఒత్తిడిని నుంచి బయటపడాలంటే నిరంతర ధ్యానం చేయాలన్నారు. ఈ ఫలితంగా ఆరోగ్యంగా కూడా మెరుగుపడుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం విజయానందరెడ్డిని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీరావ్, ప్రధాన కార్యదర్శి వీకే. విశ్వనాథ్, ఉపాధ్యక్షుడు మండీ సుధ, కోశాధికారి శివశంకర్ రెడ్డి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అడ్వకేట్ మృతి


మృతుడు విజయ్‌గోపాల్


చికిత్స పొందుతున్న వజ్రవేలు

పుత్తూరు రూరల్: పుత్తూరు బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి బార్ అసోసియేషన్‌లో సభ్యుడైన అడ్వకేట్ వి.విజయ్‌గోపాల్ (46) మృతి చెందారు. ఏఎస్‌ఐ మార్కొండేయులు కథనం మేరకు.. నాగలాపురం మండలం జానికాపురం హెచ్‌డబ్ల్యూకు చెందిన వజ్రవేలు(35), విజయ్‌గోపాల్ మోటర్ సైకిల్‌పై తిరుపతికి వెళ్తుండగా వెనుక వైపు నుంచి కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. విజయ్‌గోపాల్ అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డ వజ్రవేలును పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అదే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలు.. భద్రత డొల్ల

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బ్యాంకుల ఏటీఎంల వద్ద భద్రత ప్రశ్నార్థకంగా మారింది. బ్యాంకుల వద్ద భద్రత కోసం సెక్యూరిటీని పెట్టుకొని, బ్యాంకులో సీసీ కెమెరాలను అమర్చుకున్న అధికారులు ఏటీఎంల వద్ద మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో పలుచోట్ల చోరీలు జరిగినా.. తాజాగా తిరుపతి రూరల్ మండలం, ధనలక్ష్మినగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో దుండగులు ఏకంగా గ్యాస్‌కట్టర్‌తో యంత్రాలను కట్ చేసి రూ.18.26లక్షలను చోరీ చేయడం విస్మయాన్ని కలిగించింది. ఈ ఘటనతో భద్రత విషయం మరోసారి చర్చనీయాంశమైంది.

- పలుచోట్ల సెక్యూరిటీ గార్డుల ఊసేలేదు
- రాత్రివేళల్లో కొందరికి ఇవే పడకగదులు
- నిర్వహణ ప్రవేటు ఏజెన్సీలకు
- భద్రతతో సంబంధం లేదంటున్న బ్యాంకర్లు
- తాజాగా తిరుపతిలో చోరీ


పలమనేరు ఏటీఎం వద్ద భద్రతను పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్


పలమనేరులో సెక్యూరిటీలేని ఏటీఎంలో హాయిగా విశ్రాంతి తీసుకుంటున్న శునకాలు(ఫైల్)


గతంలో పలమనేరులోని ఓ ఏటీఎంలోనే రాత్రిపూట పడుకుంటూ మృతి చెందిన వ్యక్తి(ఫైల్)

పలమనేరు : ఏటీఎంలలో సెంటర్లలో నగదు భద్రతపై ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది. పలమనేరులో గతంలో ఇలాంటి చోరీలు జరిగాయి. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎస్‌బీఐ ఏటీఎంలో చిప్ హ్యాక్ చేసి పలువురు ఖాతాలనుంచి రూ.లక్షల్లో దోచేసిన కుంభకోణం అప్పట్లో సంచలనం సృష్టించింది. పట్టణంలోని హైవేకు పక్కన దాదాపు రెండుగంటకు పైగా దుండగులు ఏటీఎంలో గడిపి, ఆ యంత్రంలోని పలు పరికరాలను తొలగించి వారి సిస్టంకు అనుసంధానించిన చిప్‌లు తదితరాలను ఏటీఎంలో అమర్చి దర్జాగా వెళ్లిపోయారు. దీన్ని బట్టి ఏటీఎంలలో భద్రత ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు ఇదే ఏటీఎంలో మళ్లీ చోరీకి యత్నం జరిగింది. అంతకుముందు మదనపల్లె రోడ్డులోని ఏటీఎం, ఆర్టీసీ బస్టాండులోని ఏటీఎంలలో చోరీకి విఫలయత్నాలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని ఏదో ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఏదేని పెద్ద ఘటన జరిగినపుడు స్పందించడం, ఆపై పట్టించుకోకపోవడం షరామామూలుగా మారింది.


బ్యాంకర్లకు పర్యవేక్షణ లేదట..

ఉమ్మడి జిల్లాలో మూడొందలకు పైగా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులున్నాయి. వీటికి సంబంధించి 1200 ఏటీఎం సెంటర్లున్నాయి. వీటిలో నగదు పెట్టడం నుంచి వాటి నిర్వహణ తదితరాలను ప్రవేటు ఏజెన్సీలు చూస్తున్నాయి. దీంతో సంబంధిత బ్యాంకర్లు ఇక ఏటీఎంలతో తమకు సంబంధం లేదనేలా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రైవేటు బ్యాంకుల ఏటీఎంలను మినహాయిస్తే ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంకు, సప్తగిరి లాంటి బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంల వద్ద భద్రతా సిబ్బంది కనిపిస్తే ఒట్టు.

కొందరికి ఏటీఎం సెంటర్లే షెల్టర్లు

కొన్ని ఆవాసప్రాంతాల్లోని ఏటీఎంలు వర్షానికి, చలికి, వేడిలో ఏసీకోసం షెల్టర్లుగా మారాయి. గతంలో పలమనేరులోని ఓ బ్యాంకు ఏటీఎంలో ఓ వ్యక్తి తరచూ రాత్రిపూట నిద్రించేవాడు. అదే ఏటీఎంలో అతను మృతిచెందాడు కూడా. కొన్ని ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులు లేక బోర్లా తెరుచుకుని ఉండేచోట్ల లోపల శునకాలు కనిపిస్తున్నాయి. కేవలం ఏటీఎంలలో నగదు పెట్టడం తప్ప భద్రత విషయాలను ప్రైవేటు ఏజెన్సీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదనేది పచ్చినిజం.

నైట్‌బీట్లను పటిష్టం చేయాలి



పలమనేరు పట్టణం హైవేలో ఉండడంతో ఇక్కడ నైట్‌బీట్లను పటిష్టం చేశాం. ప్రతి ఏటీఎం వద్ద బీట్‌కెళ్లే కానిస్టేబుళ్లు ఏటీఎం కనిపించేలా సెల్ఫీ తీసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించాం. బ్యాంకర్లతోనూ మాట్లాడి ప్రైవేటు ఏజెన్సీలతో వారికి ఏటీఎంల వద్ద సెక్యూరిటీని పెట్టాలని సూచించాం. స్థానికులు సైతం ఏటీఎంల వద్ద ఎవరైనా అనుమానంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. – చంద్రశేఖర్, సీఐ పలమనేరు

ఏటీఎంల వద్ద పట్టించుకోనేవారెవరయ్యా..



పట్టణంలోని చాలా ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులు లేరు. ముఖ్యంగా రాత్రిపూట ఏటీఎంల లోపల ఎవరున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. పట్టణంలో కొంచెం జనసంచారం తక్కువగా ఉండే ఏటీఎంలను జేసీబీ పెట్టి పెకిలించి లారీలో తరలించినా ఎవరికీ తెలీదు. బ్యాంకర్లు కచ్చితంగా భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - పుష్పరాజ్, రిటైర్డ్ హెచ్‌ఎం, పలమనేరు

వైభవంగా పాండవుల పట్టాభిషేకం

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వాముల ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణ భగవానుడికి, శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీఅర్జునస్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం ప్రముఖ శల్య వైద్యులు ఎస్.ప్రకాష్‌రాజు, కిషోర్‌ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం ద్రౌపదీదేవి సమేత అర్జున స్వాముల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి, అశ్వ వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 7 గంటలకు మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. ఇంటింటి వద్ద మంగళ హారతులిచ్చారు. అనంతరం ఆలయానికి చేరుకొన్న అర్జున, ద్రౌపదీదేవిలతో పాటు ధర్మరాజు, భీమ, నకుల, సహదేవులను సైతం విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల ఆశీర్వచనాల మధ్య పాండవుల పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి.


అశ్వ వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి

నేటి నుంచి పెరటాసి మాసం

- శ్రీ వేంకటాచలపతి అవతరించిన మాసం
- శ్రీ వెంకన్నకు శనివారం తలిగలతో భక్తుల పూజలు

తిరుపతి కల్చరల్: పన్నెండు మాసాల సమూహాన్ని సంవత్సరం అంటారు. తెలుగు మాసాలు చంద్రమానం ప్రకారం ఉంటే, తమిళ మాసాలు సౌరమానం ప్రకారం లెక్కగడతారు. సూర్యుడు ఉన్న రాశిని బట్టి నెలకు పేరు వస్తుంది. ఈ క్రమంలో ఆరవ నెలను పెరటాసి, పురటాసి, పెరుమాళ్ అనే పేర్లతో పిలుస్తారు. శ్రీమహావిష్ణువు వేంకటాచలపతిగా అవతరించిన మాసమే పెరటాసి అని వేంకటాచలమహత్యం చెబుతోంది.

పాదయాత్రగా తిరుమలకు..

పెరటాసి మాసంలో ప్రజలందరూ శ్రీవారికి ప్రీతి పాత్రమైన శనివారాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఐదు శనివారాలు పూర్తయిన తర్వాత కుటుంబ సమేతంగా తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. తమిళులు ఈనెలలో తప్పనిసరిగా తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. గ్రామీణులు ఊళ్లకు ఊళ్లు కాలినడకన బయల్దేరి తిరుమల బాటపడతారు. ఏడాది పొడవునా సంపాదించిన దాంట్లో కొంతభాగం కూడబెట్టి కానుకలను శ్రీవారికి సమర్పించుకుంటారు. అఖిలాండం వద్ద నేతి పిండి దీపారాధనతో స్వామిని వేడుకుంటారు. గత వెయ్యేళ్లుగా ఈ ఆచారం సాగుతోందని చరిత్ర. పవిత్ర పెరటాసి మాసంలో భక్తులు నియమ నిష్టలతో ఉండాలని స్కంధపురాణం చెబుతోంది. తిరుమలేశుడికి ఈ నెలలోనే స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున ఇది శ్రీవారి తిరునాళ్ల నెలగా పిలుస్తారు. ఈ మాసపు శనివారాల్లో ఉదయాత్పూర్వమే భక్తులు నిద్రలేచి శుచిగా స్నానమాచరించి చక్కెర లేదా బెల్లం కలిపిన బియ్యం వంటకాన్ని భగవంతుడికి నివేదిస్తారు. దీనిని తలిగ అంటారు. ప్రతి భక్తుడు నియమనిష్టలతో ఉండి స్వామివారిని పూజించి ముడుపులను మూటగట్టి స్వామికి సమర్పించుకుంటారు. ఈనెల 18వ తేదీన ఆరంభమయ్యే పెరటాసిలో మొదటి శనివారం 23న మొదలై వచ్చే నెల 21న చివరి శనివారంతో ముగుస్తుంది. ఈ ఏడాది పెరటాసిలో నాలుగు శనివారాలు వస్తున్నాయి. ఇందులో తొలి, మూడో శనివారాలు శ్రేష్టమైనవని తప్పకుండా ఆ వారాలలో తలిగ వేసుకుంటే శుభం జరుగుతుందని ఆచార్య చక్రవర్తి రంగనాథన్‌వివరించారు.


శ్రీవారి ఆలయం వెలుపల గోవిందమాలధారులు

తుమ్మలగుంటలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


దేదీప్యంగా కల్యాణ వెంకన్న ఆలయం , సేనాధిపతి ఉత్సవంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి, పూజా సామాగ్రి తీసుకువస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు

- హాజరైన ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం వైభవంగా అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు సమర్పించి, భక్తులకు సర్వదర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవర్లను అలంకార మండపంలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, యాగశాలలో అంకురార్పణ, శుద్ధి క్రతువులు ఆగమోక్తంగా చేపట్టారు. అనంతరం విష్వక్సేనులవారిని మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, ఈఓ సుబ్రమణ్యం రెడ్డి, కంకణ భట్టర్ గిరిధర్ భట్టాచార్యులు పాల్గొన్నారు.

ప్రేమ్‌చంద్ కథల సంపుటి ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: భారతీయ సాహిత్యంలోనే అభ్యుదయ రచనలకు ముందడుగు మున్షీ ప్రేమ్‌చంద్ అని, ఆయన కథలు, నవలలు ఇతర భాషల్లోకి అనువాదమై నవలా చక్రవర్తిగా కీర్తి గడించారని ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షురాలు ఆర్.రాజేశ్వరమ్మ తెలిపారు. బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆదివారం ప్రేమ్‌చంద్ కథావళి (వందకథల సంపుటి) ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అనువాద సాహిత్యంతో తెలుగు భాష మరింత పరిపుష్టమవుతుందన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ ప్రేమ్ చంద్ కథా సంపుటి ఆనాటి దేశకాల పరిస్థితులను ఈ తరానికి తెలియజేశాయని తెలిపారు. కథా సంపుటి సంపాదకురాలు ఎంబీ.ప్రత్యూష మాట్లాడుతూ సాహిత్య చైతన్య ప్రవంతి కొనసాగించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సాహితీ ప్రముఖులు వి.చెంచయ్య, సాకం నాగరాజు, టెంకాయల దామోదరం, కథా ప్రపంచం తిరుపతి కిరణ్, రచయితలు పాల్గొన్నారు.


కథావళిని ఆవిష్కరిస్తున్న అతిథులు

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం


అవార్డులు అందుకున్న ప్రైవేట్ టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్సీలు ఎంవీ.రామచంద్రారెడ్డి, కల్పలత తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అపుస్మా(ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అండ్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్) ఆధ్వర్యంలో ప్రైవేట్ టీచర్లకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల్లో ఉత్తమ సేవలు అందించే ప్రభుత్వ ఉపాధ్యాయులను ఏటా సెప్టెంబర్ 5న అవార్డులతో సన్మానిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన అపుస్మా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీఆర్.మహేష్, ఎస్ఎస్‌కే.రాజాను అభినందించారు. అనంతరం ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన టీచర్లను సత్కరించి, మెమెంటో, సర్టిఫికెట్‌లను అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు విశ్వనాథరెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యువరాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి జయకాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘ఔట్ సోర్సింగ్’ సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు కోరారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ భవన్‌లో జిల్లా మహాజన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేతనాల పెంపుతో పాటు ప్రత్యేక సర్వీస్ రూల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఏపీజేఏసీ అమరావతి సంఘం , ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. జేఏసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పద్మజారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం జేఏసీ జిల్లా నూతన కమిటీ చైర్మన్‌గా పీటీ బాలసుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా జ్యోతిరావు, కోశాధికారిగా కిరణ్ మరో 20 మందిని ఎన్నుకున్నారు. వారికి నియామకపత్రాలను అందజేశారు.


నియామకపత్రాలు అందుకుంటున్న నూతన కమిటీ సభ్యులు

పెళ్లికి వెళ్లి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి
- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

నగరి : మండలంలోని వీకేఆర్ పురం బాలాజీ భవన్ సమీపం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసన్ (50) అనే వ్యక్తి మృతిచెందగా, కృష్ణప్ప (60)తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ సురేష్ కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా, ఆర్కేపేట బాలాపురానికి చెందిన శ్రీనివాసన్, కృష్ణప్ప ద్విచక్రవాహనంలో నగరికి పెళ్లికి వచ్చారు. ఆదివారం వేకువజామునే తిరిగి బయలు దేరారు. మార్గమధ్యమంలో వీకేఆర్‌పురం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసన్ అక్కడికక్కడే మృతిచెందగా, కృష్ణప్ప తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. క్షతగాత్రుడిని చికిత్సకు, మృతదేహాన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కృష్ణప్ప పరిస్థితి విషమంగా ఉండడంతో తిరువళ్లూరు జీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


శ్రీనివాసన్ మృతదేహం

రైలు ఢీకొని హెచ్‌ఎం దుర్మరణం

కుప్పంరూరల్: రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ప్రధానోపాధ్యాయుడు దుర్మరణం చెందిన సంఘటన కుప్పం మండలం డీకే పల్లి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా కెలమంగళంలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న సప్పానిదేవరాజులు (52) కుప్పంలో కాపురం ఉంటున్నాడు. శనివారం రాత్రి డి.కె.పల్లి వైపు నుంచి రైల్వే ట్రాక్ దాటుకుని కుప్పం వచ్చే సమయంలో చెన్నై–బెంగళూరు ట్రాక్‌పై రైలు ఢీకొంది. దేవరాజులు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చంద్రగిరి : స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చంద్రగిరిలోని భారతీనగర్‌కు చెందిన శశికుమార్ ట్రాన్స్‌కోలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి దోర్నకంబాల పంచాయతీలో విద్యుత్ తీగలు తెగిపోవడంతో ఆదివారం ఉదయం మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. స్తంభం ఎక్కి తీగలు లాగుతుండాద ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 11 కేవీ కరెంట్ వైర్ తగలడంతో షాక్ తగిలి కిందపడిపోయాడు. స్థానికులు 108లో చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.